నకిలీ మద్యంపై కన్నెర్ర



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న మాజీ మంత్రి వేణుగోపాలకృష్ణ, తిప్పల గురుమూర్తిరెడ్డి, మహిళా నేతలు



ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం ఇస్తున్న మాజీ ఎంపీ భరత్ రామ్

- వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన
- ప్రజల ప్రాణాలతో కూటమి చెలగాటం
- కాసుల కోసం పాలకుల ఆరాటం
- ప్రభుత్వ తీరుపై మాజీ మంత్రి వేణు, మాజీ ఎంపీ భరత్ ధ్వజం

రాజమహేంద్రవరం రూరల్: కూటమి ప్రభుత్వం నకిలీ మద్యాన్ని సరఫరా చేసి, ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు బొమ్మూరులోని కలెక్టరేట్ వద్ద సోమవారం ఆయన ఆధ్వర్యంలో పార్టీ మహిళా నాయకులతో కలిసి నిరసన తెలిపారు. రాష్ట్రంలో నకిలీ మద్యాన్ని అరికట్టి, సీబీఐ విచారణ చేపట్టాలని నినాదాలు చేశారు. అనంతరం కలెక్టరేట్‌లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సీహెచ్ లావణ్యకు మహిళా నేతలతో కలిసి వేణుగోపాలకృష్ణ, పార్లమెంటరీ పరిశీలకులు తిప్పల గురుమూర్తిరెడ్డి వినతిపత్రం అందజేశారు.

సీబీఐతో విచారణ జరపాలి

మాజీ మంత్రి వేణు మాట్లాడుతూ గత వైఎస్సార్ సీపీ పాలనలో ప్రభుత్వ మద్యం దుకాణాల ద్వారా విక్రయాలు జరిపిస్తే, దానిపై కూటమి పాలకులు దుష్ప్రచారం చేసి తప్పుడు కేసులు పెట్టారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తంబాలపల్లె, ఇబ్రహీంపట్నం, పాలకొల్లు, అమలాపురాల్లో స్పిరిట్‌ను తెచ్చి మద్యంగా తయారు చేసి కల్తీ మద్యం అమ్ముతున్నారన్నారు. దీనిపై సిట్‌తో కాకుండా సీబీఐతో విచారణ జరిపించాలన్నారు. సురక్ష యాప్ ద్వారా మద్యం చెక్ చేసుకుని తాగాలని చంద్రబాబు చెప్పడమంటే.. కల్తీ మద్యం రాష్ట్రంలో ఉందని ఒప్పుకున్నట్టేనన్నారు.

ప్రాణాలతో చెలగాటం

రాజమహేంద్రవరం పార్లమెంటరీ పరిశీలకులు తిప్పల గురుమూర్తిరెడ్డి మాట్లాడుతూ నకిలీ మద్యం సరఫరా చేసి, ప్రజల ప్రాణాలతో కూటమి ప్రభుత్వం ఆటలాడుతోందన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ పరిశీలకులు నక్కా శ్రీనగేష్ మాట్లాడుతూ ప్రజలు ప్రాణాలను హరిస్తున్న నకిలీ మద్యం, బెల్టు షాపులను అరికట్టాలన్నారు. రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి అంగాడి సత్యప్రియ, హితకారిణి సమాజం మాజీ డైరెక్టర్ దేవులపల్లి సరితారాణి, రూరల్ నియోజవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు ఆచంట మారుతీదేవి మాట్లాడుతూ నకిలీ మద్యం, బెల్టు షాపులను అరికట్టకపోతే ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు, మాజీ వైస్ ఎంపీపీ నక్కా రాజబాబు, రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి ఎంఎం అలీ, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి విప్పర్తి ఫణి, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి రేలంగి వీర వెంకట సత్యనారాయణ, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి పడాల వీర రాఘవ రెడ్డి, జిల్లా క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎం.విజయ సారథి, జిల్లా ప్రధాన కార్యదర్శులు తాడాల చక్రవర్తి, దాసరి శివ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు బొప్పన సుబ్బారావు, జిల్లా కోశాధికారి యెజ్జు వాసు, జిల్లా కార్యదర్శి ముద్దాల అను, వివిధ విభాగాల నియోజకవర్గ అధ్యక్షులు చీకురుమిల్లి చిన్న, చింతపర్తి రాంబాబు, పెనుమాక సునీల్, బత్తిన అప్పారావు, మాజీ సర్పంచ్ అత్తిలి భీమ శంకరం, పార్టీ నాయకులు, మహిళా నేతలు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ భరత్ ఆధ్వర్యంలో..

సీటీఆర్ఐ: నకిలీ మద్యం తయారీ, అమ్మకాలపై సీబీఐ విచారణ చేయాలని మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ డిమాండ్ చేశారు. నకిలీ మద్యం విక్రయాలను నిరసిస్తూ ఆయన ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. దీనిలో భాగంగా వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి ర్యాలీగా బయలుదేరి కటారి నగర్ రామాలయం సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ వైఎస్సార్ సీపీ శ్రేణులతో కలిసి మానవహారం నిర్వహించి, రాస్తారోకో చేశారు. చంద్రబాబు దాహానికి నకిలీ మద్యంతో ప్రజలు ప్రాణాలు బలి, ఎన్ బ్రాండ్ మాకొద్దు బాబు, నాణ్యమైన మద్యం అంటే నకిలీ మద్యమా, రాష్ట్రంలో కుటీర పరిశ్రమలాగా నకిలీ మద్యం తయారీ కేంద్రాలు అంటూ నినాదాలు చేశారు. అనంతరం చంద్రబాబు చిత్రపటానికి వైఎస్సార్ సీపీ మహిళా నాయకులు మద్యాభిషేకం చేసి నిరసన వ్యక్తం చేశారు. నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారు.

వినతి పత్రం అందజేత

ప్రకాశం నగర్‌లోని ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద ఆందోళన చేసి ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. మాజీ ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ రాష్ట్రంలో నకిలీ మద్యం స్కామ్‌పై సీబీఐతో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రాణాలను హరిస్తున్న నకిలీ మద్యం అమ్మకాలను అరికట్టాలని కోరారు. నకిలీమద్యం తయారు చేసి అమ్మకాలు చేస్తూ పట్టుబడిన వ్యక్తికి 2024 అసెంబ్లీ ఎన్నికలలో తంబాలపల్లి నియోజకవర్గం పోటీ చేసే విధంగా టీడీపీ పార్టీ బీ ఫారం ఇచ్చిందని తెలిపారు. ప్రజల ప్రాణాలంటే కూటమి నాయకులకు లెక్క లేకుండా పోయిందన్నారు. ఎమ్మార్పీ కంటే లోకేష్ బాబు, చంద్రబాబు మామూళ్లను షాపుల వద్ద నుంచే వసూలు చేస్తున్నారని విమర్శించారు. బాటిల్‌పై అదనపు ధరలు వసూలు చేసి పేదల నడ్డి విరుస్తున్నారని పేర్కొన్నారు. నకిలీ మద్యం తాగి మృతి చెందిన, అనారోగ్యం పాలైన వారికి నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

క్లుప్తంగా

25న ఇరిగేషన్ సంఘ ఎన్నికలు

ధవళేశ్వరం: సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ఇరిగేషన్ ఎంప్లాయిస్ పరస్పర సహాయక సహకార సంఘం లిమిటెడ్ నూతన పాలక మండలి ఎన్నికలను ఈ నెల 25న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎన్నికల అధికారి బీవీవీ సత్యనారాయణ సోమవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. చైర్మన్, నలుగురు సభ్యులతో కూడిన అడహక్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రక్రియ జరగనుంది. ఈ నెల 16న నామినేషన్ల స్వీకరణ, 17న పరిశీలన , 18న ఉప సంహరణకు చివర గడువు ఉంటుందన్నారు. 25వ తేదీ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ధవళేశ్వరంలోని ఐఎన్‌టీయూసీ భవన ప్రాంగణంలో ఎన్నికలు జరుగుతాయని వెల్లడించారు.

త్యాగరాజుకు పరామర్శ



త్యాగరాజును పరామర్శిస్తున్న చెల్లుబోయిన వేణు, జక్కంపూడి రాజా

రాజమహేంద్రవరం రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి, శస్త్ర చికిత్స చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న బొమ్మూరుకు చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి యెనుముల త్యాగరాజును సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజా పరామర్శించారు. వారి వెంట మాజీ ఉప సర్పంచ్ దాకే శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ముద్దాల అను, కోటిపల్లి రవి తదితరులు ఉన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

కంబాలచెరువు: కంబాల పేట అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పరిధిలోని ప్రకాశం నగర్ ఎస్సీ బాలికల వసతి గృహంలో సోమవారం సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అనూహ్య మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలను రక్షించడానికి ఉపయోగించే ఒక జీవ రక్షక ప్రక్రియ సీపీఆర్ అన్నారు. సైకాలజిస్ట్ ప్రియాంక బాలికలలో మానసిక ఆరోగ్య పరిస్థితులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీపీఎంఓ వీరయ్య, సూపర్ వైజర్ డీడీ భవాని, హాస్టల్ వార్డెన్ త్రివేణి పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడి కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న గోకవరం సంజీవ నగర్‌కు చెందిన తోటాడి అబ్బులు (33) సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. పోలీసులు కథనం ప్రకారం.. గోకవరం సంజీవ నగర్‌కు చెందిన తోటాడి అబ్బులు బస్సు క్లీనర్‌గా పని చేస్తాడు. గత నెల 30వ తేదీ సాయంత్రం ఆరు గంటలకు లాలాచెరువు నుంచి దివాన్ చెరువుకు ఆటోలో వెళతున్నాడు. మార్గం మధ్యలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ వద్ద ఆటో డ్రైవర్ సడన్‌గా బ్రేక్ వేశాడు. దీంతో అబ్బులు రోడ్డుపై పడి గాయాల పాలయ్యాడు. అతడిని రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి, అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని తల్లి చంద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజయోనాకు పురస్కారం



అవార్డు అందుకుంటున్న రాజయోనా

రాజమహేంద్రవరం రూరల్: ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో చేస్తున్న తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాల కృషికి గాను అద్దంకి రాజయోనాకు ప్రతిభా పురస్కారం లభించింది. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని మినిస్టర్ కార్యాలయంలో సోమవారం ఉదయం తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, పౌర సంబంధాల శాఖామాత్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా ఆయన అందుకున్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి మృతి

కంబాలచెరువు: కుటుంబ కలహాలతో ఉరి వేసుకుని వ్యక్తి మృతి చెందిన సంఘటన సారంగధరమెట్టలో సోమవారం జరిగింది. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. షేక్ సుల్తాన్ (38) కొంతకాలంగా తన భార్యకు దూరంగా ఉంటున్నాడు. ఇదిలావుండగా ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరివేసుకున్నాడు. దీనిపై సమాచారం అందిన పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్ పీజీఆర్ఎస్‌కు 30 ఫిర్యాదులు

కంబాలచెరువు: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 30 అర్జీలు వచ్చాయి. ఫిర్యాదు దారులతో ఎస్పీ డి.నరసింహ కిశోర్ నేరుగా మాట్లాడారు. వెంటనే సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడి, ఫిర్యాదు దారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయాలని ఉత్తర్వులు ఇచ్చారు.

అగ్ని ప్రమాద బాధితులకు వితరణ



బాధితులకు సామగ్రి, నిత్యావసరాలు అందజేస్తున్న గిరజాల బాబు తదితరులు

కడియం: గ్రామంలోని పెద్ద చెరువు సమీపంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను బాధ్యత సేవా సంస్థ ఆదుకుంది. ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి గిరజాల బాబు నేతృత్వంలో సభ్యులు సోమవారం బాధితులకు దుస్తులు, బియ్యం, వంట సామగ్రి, పప్పులు, గృహోపకరణాలు అందజేశారు. రెండు రోజుల క్రితం ప్రమాదం జరిగినప్పుడు తక్షణమే బాబు అక్కడికు చేరుకుని, తన మిత్రులు, స్థానికుల సహకారంతో మంటలను అదుపు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువకులు ఎంతో సాహసంతో కాలిపోతున్న గ్యాస్ సిలిండర్‌ను చాకచక్యంగా బయటికి తీసుకొచ్చి ప్రమాదాన్ని కొంతమేర నిలువరించగలిగారన్నారు. అధికారులు తక్షణం స్పందించి బాధితులకు ప్రభుత్వం తరపున ఆర్థిక సాయాన్ని అందించాలన్నారు. దాతలు, స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో బాధ్యత సభ్యులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయులు చిలుకూరు శ్రీనివాస్, షేక్ మహమ్మద్ సర్కార్ బాషా, పున్నమి రాజు వీర్రాజు, కడియం గణేష్, సూరిశెట్టి వెంకట్లు, కామిరెడ్డి దుర్గారావు, బైరిశెట్టి బాబ్జీ, రావిపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



విద్యార్థికి ఆర్థిక సాయం అందజేస్తున్న చక్రవర్తి

కడియం: కడియపులంకకు చెందిన టీవీసీ చారిటబుల్ ట్రస్టు అధినేత, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాడాల విష్ణుచక్రవర్తి రాజమహేంద్రవరానికి చెందిన పేద విద్యార్థి భరత్‌కు ఆర్థిక సాయం అందజేశారు. నర్సరీ వ్యాపార రంగంలో స్థిరపడిన ఆయన.. తన కుటుంబ సభ్యుల సహకారంతో టీవీసీ చారిటబుల్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.

ఆకట్టుకున్న యానిమేషన్ పిక్సెల్



యానిమేషన్ పిక్సెల్‌లో పాల్గొన్న విద్యార్థులు

కంబాలచెరువు: యానిమేషన్ కళాశాల విద్యార్థుల ప్రతిభ అందరినీ అబ్బురపరిచింది. నరుటో, సిండ్రెల్లా, మినియేచర్ విభాగాల్లో వారి చేతిలో రూపుదిద్దుకున్న పలు చిత్రాలు ఆకట్టుకున్నాయి. స్థానిక ఆదిత్య యానిమేషన్ కళాశాలలో సోమవారం యానిమేషన్ పిక్సెల్ నిర్వహించారు. ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఈ ఈవెంట్ జరిగింది. వందేమాతర గీతంతో ప్రారంభమైన ఈ కార్యక్రమం చివరి వరకూ అలరించింది. దీనికి పలువురు సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు సైతం హాజరయ్యారు. నరుటో అనే అంశంతో యానిమేషన్ ప్రక్రియ సాగింది. అలాగే ఈ అంశంలో పెయింటింగ్‌లు నిర్వహించారు. విద్యుత్ సంబంధించిన పలు విషయాలను విద్యార్థులు ఆవిష్కరించారు. సిండ్రెల్లా అంశంపై తయారు చేసి పలు రకాల ఆకృతులు ఆలోచింపజేసేలా ఉన్నాయి. యానిమేషన్ ల్యాబ్ టెక్నీషియన్ మహాలక్ష్మి సహకారంతో జరిగిన ఈ కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందించారు. యానిమేషన్‌లో అద్భుత చిత్రాలు సృష్టించిన విద్యార్థులను విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎస్.సుగుణారెడ్డి, ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ అభినందించారు. కార్యక్రమంలో రాజేష్ ఖన్నా, మౌనిక, కృష్ణ, హేమ, చిరాగ్ పాల్గొన్నారు.

నన్నయ వర్సిటీ మహిళా కబడ్డీ జట్టు ఎంపిక



అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా కబడ్డీ పోటీలకు ఎంపికైన 'నన్నయ' జట్టు

పెదపూడి: తమిళనాడులోని సేలంలో ఈ నెల 29 నుంచి జరిగే అంతర్ విశ్వవిద్యాలయాల మహిళా కబడ్డీ పోటీల్లో పాల్గొన్న ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం జట్టును ఎంపిక చేశారు. పెదపూడి మండలం జి.మామిడాడలోని డీఎల్ రెడ్డి డిగ్రీ కళాశాలలో రెండు రోజుల పాటు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన జట్టులోని క్రీడాకారులనుద్దేశించి వర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపాల్ పి.విజయ నిర్మల మాట్లాడుతూ, ఉత్తమ ప్రతిభతో విజయం సాధించి, విశ్వవిద్యాలయానికి జాతీయ స్థాయి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. స్థానిక ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ సబ్బెళ్ల శివన్నారాయణరెడ్డి మాట్లాడుతూ, వర్సిటీ పరిధిలోని ఉభయ గోదావరి జిల్లాల నుంచి వచ్చిన 150 మంది క్రీడాకారుల నుంచి 14 మందితో కూడిన జట్టును ఎంపిక చేశారన్నారు. ఎంపిక పోటీల పరిశీలకురాలిగా జి.ప్రమీలారాణి, ఎంపిక కమిటీ సభ్యులుగా వై.సుధారాణి, ఎం.వీరబాబు వ్యవహరించారు. కార్యక్రమంలో అంతర్జాతీయ కబడ్డీ కోచ్ పీవీఎస్‌వీ సాయిప్రసాద్, జి.మామిడాడ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ, కరస్పాండెంట్ డీఆర్‌కే రెడ్డి, అధ్యక్షుడు మేడపాటి రామచంద్రారెడ్డి, డీఎల్ రెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీనివాస్ రెడ్డి, పీడీ సూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోలవరం భూసేకరణ అక్రమాలను అడ్డుకుంటాం

- గిరిజనుల స్వాధీనంలోని భూములకు నోటిఫికేషన్ ఇవ్వడం అక్రమం
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- పోలవరం ఆర్‌అండ్‌ఆర్ కార్యాలయం ఎదుట గిరిజనుల ధర్నా



పోలవరం కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గిరిజనులు

ధవళేశ్వరం: పోలవరం ప్రాజెక్టు భూసేకరణకు తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్‌లో అక్రమాలను అడ్డుకుంటామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం, పోలవరం, జీలుగుమిల్లి మండలాల్లోని 20 గ్రామాల గిరిజనులు ధవళేశ్వరంలోని పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. కాటన్ బ్యారేజీ సెంటర్ నుంచి వందలాది మంది ర్యాలీగా వెళ్లి, కార్యాలయం గేటు ఎదుట ధర్నా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ, బుట్టాయిగూడెం, పోలవరం, జీలుగుమిల్లి మండలాల్లో ఇప్పటి వరకూ 5 నోటిఫికేషన్లు ఇచ్చారని, ప్రతి దానిలోనూ అక్రమాలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. గ్రామసభలు నిర్వహించలేదని, పెసా కమిటీల అనుమతులు సైతం లేకుండానే నోటిఫికేషన్ జారీ చేశారని తెలిపారు. గిరిజనుల సాగులో ఉన్న భూములను భూస్వాముల పేరిట రికార్డుల్లో నమోదు చేశారని చెప్పారు. తద్వారా అక్కడి అధికారులు ఆ భూస్వాములతో కుమ్మక్కయినట్లు స్పష్టమవుతోందన్నారు. ఇటువంటి అక్రమాలను అడ్డుకుని, గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనుల రక్షణకు ఏర్పాటైన చట్టాల అమలులో పాలనా యంత్రాంగం విఫలమవుతోందన్నారు. పోలవరం భూసేకరణ పేరుతో కోట్ల రూపాయలు కొల్లగొట్టే ప్రయత్నాన్ని అడ్డుకుంటామని శ్రీనివాసరావు చెప్పారు. ప్రతి ఎకరాకు బహిరంగ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో 1.05 లక్షల మంది నిర్వాసితులవుతున్నారని, ఇప్పటి వరకూ 12 శాతం మందికే పునరావాసం కల్పించారని, ఆలస్యంగా చేసినా అన్నీ అవకతవకలే వెలుగు చూస్తున్నాయని అన్నారు.

న్యాయం చేయకుంటే ఆందోళన ఉధృతం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు బి.బలరాం మాట్లాడుతూ, గిరిజనులకు న్యాయం చేయకుంటే ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామని అన్నారు. సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ, గిరిజనులు తమ గోడు వెలిబుచ్చేందుకు వచ్చారని, పాలనా యంత్రాంగం పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు మొడియం నాగమణి మాట్లాడుతూ, న్యాయం జరిగేంత వరకూ పోరాటం కొనసాగిస్తామని, ప్రతి ఒక్కరూ భవిష్యత్తు పోరాటాలకు సంసిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆందోళన నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటివ్ అధికారి వి.అభిషేక్ వచ్చి గిరిజనులు, నాయకులతో మాట్లాడి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గిరిజనుల అభ్యర్థనలను స్వీకరించారు. వాటిని పరిశీలిస్తామని, ఏలూరు జిల్లా కలెక్టర్, ఆర్‌డీఓలతో చర్చిస్తానని చెప్పారు. గిరిజనులకు అన్యాయం జరగనివ్వబోమని, విచారణ అనంతరం పరిష్కారం చూపిస్తామని హామీ ఇచ్చారు. ఆందోళనలో సీపీఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, బుట్టాయిగూడెం, పోలవరం, జీలుగుమిల్లి మండల కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, కారం భాస్కరరావు, తెల్లం దుర్గారావు, ఏలూరు జిల్లా కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు తామ ముత్యాలమ్మ, తూర్పు గోదావరి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పవన్, జువ్వల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ 2.0 తో సామాన్యులకు ఊరట



బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ కీర్తి

సీటీఆర్ఐ: కేంద్రం అమలు చేస్తున్న సూపర్ జీఎస్టీ 2.0తో ప్రజలకు ఊరట లభిస్తోందని కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ ప్రచార కార్యక్రమంలో భాగంగా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో సోమవారం వై.జంక్షన్ నుంచి పుష్కర ఘాట్ వరకూ నిర్వహించిన బైక్ ర్యాలీని జెండా ఊపి ఆమె ప్రారంభించారు. అనంతరం సూపర్ జీఎస్టీ 2.0 వల్ల కలిగే లాభాలను వివరించారు. అనంతరం పుష్కర ఘాట్ వద్ద పొదుపు సంఘాల మహిళలతో స్వదేశీ వస్తువుల ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీవీ రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకట రమణ, కమర్షియల్ ట్యాక్స్ అధికారి రత్న కుమార్, సెక్రటరీ జి.శైలజావల్లి, డిప్యూటీ సిటీ ప్లానర్ నాయుడు, ఎంహెచ్ఓ వినూత్న, మెప్మా జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ టి.కనకరాజు, సీఎంఎం రామలక్ష్మి, ఈఈ మదర్సా అలీ పాల్గొన్నారు.

26న కిక్ బాక్సింగ్ పోటీలు



పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరులోని మారుతి సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీలో ఈ నెల 26న ఖేలో ఇండియా అస్మిత కిక్ బాక్సింగ్ పోటీలు నిర్వహించేందుకు వాకో ఇండియా నేషనల్ బోర్డు అనుమతి ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఆ పోటీల పోస్టర్‌ను సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ డి.నరసింహ కిశోర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కిక్ బాక్సింగ్ ప్రెసిడెంట్ జి.ఆనంద బాలు, జిల్లా సెక్రటరీ ఎస్.గిరి వెంకట రమణ, కోశాధికారి ఎం.భవానీ శంకర్, ఆర్థోపెడిక్ డీఎస్ ఫణి, కోనసీమ జిల్లా ప్రెసిడెంట్ బీకే రత్నం పాల్గొన్నారు.

బహుభాషా గాయకుడు కిశోర్ కుమార్



కిశోర్ కుమార్ వర్ధంతిలో పాల్గొన్న జిత్‌మోహన్‌మిత్ర తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రపంచం గర్వించదగ్గ గాయకులలో బహుభాషా గాయకుడు కిశోర్ కుమార్ ఒకరని నట గాయకుడు జిత్‌మోహన్‌మిత్ర కొనియాడారు. స్థానిక జిత్‌మోహనమిత్ర కళావేదికపై సోమవారం సాయంత్రం కిశోర్ కుమార్ వర్ధంతి సభను ఆయన అధ్యక్షతన నిర్వహించారు. జిత్‌మోహన్ మిత్ర ఆర్కెస్ట్రా తరఫున గుంటూరు శ్రీనివాస్, డాక్టర్ వంక బాలకృష్ణ, కృష్ణ, డాక్టర్ హేమ నళిని, విశ్వనాథ్, హరి, ఆదిత్య, చింతా రమణమూర్తి, రుక్మిణి దంపతులు పలు కిశోర్ కుమార్ పాటలను పాడి స్వర నివాళి అర్పించారు. శ్రీపాద మిత్ర ఆర్కెస్ట్రా తరఫున డాక్టర్ హేమనళినికి గాన కోకిల లతా మంగేష్కర్ పురస్కారం అందించి ఘనంగా సత్కరించారు.

అన్ని హంగులున్న వినోదాత్మక చిత్రంగా కె-రాంప్



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్ అబ్బవరం

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అన్ని హంగులతో కూడిన వినోదాత్మక చిత్రంగా కె-రాంప్‌ను రూపొందించామని హీరో కిరణ్ అబ్బవరం తెలిపారు. హాస్య మూవీస్ పతాకంపై నాని దర్శకత్వంలో రాజేష్ దండా నిర్మించిన ఆ సినిమా ఈ నెల 18వ తేదీన దీపావళి కానుకగా ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్‌లో భాగంగా రాజమహేంద్రవరం వచ్చిన కిరణ్ అబ్బవరం స్థానిక హోటల్ షెల్టాన్‌లో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఈ సినిమా టీజర్, ట్రైలర్‌కు మంచి స్పందన వచ్చిందన్నారు. యుక్తి తరేజా, నరేష్, సాయి కుమార్, అలీ, వెన్నెల కిషోర్, అజయ్ అనన్య తదితరులు నటించిన ఈ సినిమా మాస్ కామెడీ ఎంటర్ టైనర్‌గా అన్ని వర్గాలను ఆకట్టుకుంటుందని కిరణ్ అబ్బవరం చెప్పారు. చెన్నై లవ్, ఉగాది రోజు టైటిల్స్ తో సినిమాలు చేస్తున్నానని మరో మూడు సినిమాలు కూడా చేయనున్నట్లు ఆయన తెలిపారు.

నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డీవో కృష్ణ నాయక్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): బాణసంచా షాపుల యజమానులు ప్రభుత్వ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, లైసెన్సు షరతులను ఉల్లంఘించిన పక్షంలో అనుమతులు రద్దుచేస్తామని రాజమహేంద్రవరం ఆర్‌డీవో కృష్ణ నాయక్ హెచ్చరించారు. రాజమహేంద్రవరంలోని ఆర్‌డీవో కార్యాలయంలో సోమవారం సాయంత్రం డివిజన్ స్థాయి అధికారులు, బాణసంచా షాపుల యజమానులు, అసోసియేషన్ సభ్యులతో ఆయన, జిల్లా అగ్నిమాపక అధికారి మార్టిన్ లూథర్ కింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాణసంచా షాపుల ఏర్పాటు, భద్రతా ప్రమాణాలు, అగ్ని ప్రమాదాల నివారణ చర్యలు, ప్రజల రక్షణకు తీసుకోవాల్సిన ఏర్పాట్లపై చర్చించారు.